# ముందస్తు సాగు సక్సెస్

- 132రోజుల్లోనే చేతికొచ్చిన పంట
- స్వగ్రామం నాగారంలో పంట కోసిన మంత్రి జగదీశ్‌రెడ్డి
- మంత్రి బాటలో యాసంగి సాగుకు సన్నద్ధమవుతున్న రైతాంగం



నాగారంలోని వ్యవసాయ క్షేత్రాన్ని పరిశీలిస్తున్న మంత్రి జగదీశ్‌రెడ్డి

నాగారం, అక్టోబర్ 16 : ప్రకృతి వైపరీత్యాల నుంచి రైతాంగాన్ని తప్పించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ తీసుకొచ్చిన ముందస్తు సాగు నాగారంలో విజయవంతమైంది. సోమవారం రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి తన వ్యవసాయ క్షేత్రంలో కుల దైవానికి పూజలు నిర్వహించి పంట కోతకు శ్రీకారం చుట్టారు. ప్రయోగాత్మకంగా మంత్రి జగదీశ్‌రెడ్డి తీసుకున్న నిర్ణయాన్ని రైతాంగం అనుసరించి విత్తనాలు చల్లిన అంశం అప్పట్లో రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. ప్రకృతి వైపరీత్యాల నుంచి మాత్రమే కాకుండా దోమకాటు, ఇతరాత్ర చీడ పీడల నుంచి బయట పడడం ముందస్తు సాగులో చెప్పుకోదగ్గ అంశం. ప్రయోగాత్మకంగా మంత్రి చేసిన సాగులో 132 రోజులకే పంట చేతికి రాగా ఎకరాకు 45బస్తాల ధాన్యం దిగుబడి రావడం విశేషం, దీంతో యాసంగి ముందస్తు సాగుకు రైతాంగం సన్నద్ధమవుతున్నారు.



కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

## ఉండ్రుగొండలో వైభవంగా కల్యాణోత్సవం

చివ్వెంల, అక్టోబర్ 16 : మండలంలోని ఉండ్రుగొండ గుట్టల్లో కొలువైన లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో సోమవారం అశ్వయుజ మాస నక్షత్రం సందర్భంగా శ్రీమాన్ ఆసూరి అరవిందాచార్యులు, ఆలయ అర్చకుడు కృష్ణమాచార్యులు ఆధ్వర్యంలో కల్యాణం ఘనంగా జరిపించారు. అనంతరం అన్నదానం చేశారు. కల్యాణానికి ఉమ్మడి నల్లగొండ జిల్లాతో పాటు, హైదరాబాద్, గుంటూరు ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లు ప్రారంభించాలి

- నేడు జిల్లావ్యాప్తంగా అన్ని కేంద్రాలు ప్రారంభించాలి
- 4.15లక్షల మెట్రిక్ టన్నులు సేకరించాలి
- సమీక్షా సమావేశంలో కలెక్టర్ ఎస్.వెంకట్రావ్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎస్.వెంకట్రావ్

సూర్యాపేట, అక్టోబర్ 16 : రైతులు వానాకాలంలో పండించిన వరి ధాన్యం సేకరణకు ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాలను మంగళవారమే ప్రారంభించాలని కలెక్టర్ ఎస్.వెంకట్రావ్ అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో వానాకాలం ధాన్యం కొనుగోళ్లపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. జిల్లావ్యాప్తంగా 296 కొనుగోలు కేంద్రాలు ఏక కాలంలో ప్రారంభించాలన్నారు. ఐకేపీ కేంద్రాలు 183, పీఏసీఎస్ కేంద్రాలు 113 ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఎన్నికల నిబంధనలు పాటిస్తు కొనుగోలు కేంద్రాలు నిర్వహించాలన్నారు. ప్రారంభోత్సవ బ్యానర్లపై ఎలాంటి ఫొటోలు పెట్టకూడదన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మండలాల్లో నోడల్ అధికారిగా స్థానిక తాసీల్దార్ వ్యవహరిస్తారని చెప్పారు. రైతుల సమస్యల పరిష్కారానికి జిల్లా, డివిజన్, క్లస్టర్ వారీగా కమిటీలు ఏర్పాటు చేసి రైతులకు ఎక్కడా సమస్యలు రాకుండా చూస్తారని చెప్పారు. ధాన్యం కొనుగోలుకు కోటి గన్నీ బ్యాగులు అవసరం కాగా జిల్లాలో 61లక్షల గన్నీ బ్యాగులు ఉనాయని మరో 42లక్షల గన్నీ బ్యాగులు రావాల్సి ఉందని చెప్పారు. రైతులు తడి ధాన్యం గాకుండా ఆరబెట్టి తేవాలని సూచించారు. 17శాతం తేమ శాతం లేకుండా చూసుకోవాలని కోరారు. అన్ని శాఖలు బాధ్యతలను సక్రమంగా నిర్వహిస్తూ ప్రభుత్వ మార్గదర్శకాలు అనుసరించి కొనుగోలు కేంద్రాలను నడపాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ ఎ.వెంకట్‌రెడ్డి, సివిల్ సప్లై డీఎం రాంపతినాయక్, డీఎస్‌ఓ మోహన్‌బాబు, డీఏఓ రామరావునాయక్, డీఆర్‌డీఓ సుందరి కిరణ్‌కుమార్, ఆర్డీఓలు జగదీశ్‌రెడ్డి, వీరబ్రహ్మాచారి, సూర్యనారాయణ, రవాణా శాఖాధికారి వెంకట్‌రెడ్డి, తూనికలు, కొలతల అధికారి వెంకటేశ్వర్లు, వ్యవసాయ, రెవెన్యూ, పంచాయతీ రాజ్, మెప్మా, డీఆర్‌డీఏ అధికారులు పాల్గొన్నారు.

## పేటవాసికి మోస్ట్ వాల్యూడ్ ప్లేయర్ అవార్డు



డిసైబోజ్-11 అవార్డుతో మౌనిశ్

బొడ్రాయిబజార్, అక్టోబర్ 16 : అమెరికాలో ఉంటున్న సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ, శ్రీనివాస్ కుమారుడు మౌనిశ్‌కు మోస్ట్ వాల్యూడ్ ప్లేయర్ అవార్డు అందుకున్నారు. పీఎస్సీఎల్ -2023 ఛాంపియన్స్ లీగ్ కింగ్ ఆఫ్ స్టేట్స్ క్రికెట్‌లో ఉత్తమ ప్రతిభ కనబర్చినందుకు ఆయనకు మోస్ట్ వాల్యూడ్ ప్లేయర్ డిసైడోజ్-11 అవార్డు అందించారు. కుమారుడికి అవార్డు రావడంపై మున్సిపల్ చైర్‌పర్సన్ పెరుమాళ్ల అన్నపూర్ణ శ్రీనివాస్ దంపతులు హర్షం వ్యక్తం చేశారు. మౌనిశ్‌కు అవార్డు రావడంతో సూర్యాపేట పట్టణంలోని 9వ వార్డు ప్రజలు సంబురాలు జరుపుకొన్నారు.

## విజయదశమి 24న జరుపుకోవాలి

### వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలాచార్యులు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 16 : విజయదశమి పండుగ విషయంలో ప్రజలెవరూ అపోహలు నమ్మవద్దని, ఈ నెల 24న మంగళవారం విజయదశమి పండుగ జరుపుకోవాలని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రధాన అర్చకుడు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విజయదశమి పండుగ విషయంలో కొందరు కావాలని గందరగోళానికి గురి చేస్తున్నారని ఎవరూ వారిని విశ్వసించవద్దని కోరారు. ఈ నెల 24న శ్రావణ నక్షత్రం లేదంటూ పండుగ జరుపరాదంటూ అంటున్నారని కానీ దసరా పండుగకు దశమి తిథి ప్రధానమని శ్రావణ నక్షత్రం కలిస్తే విశేషమని పేర్కొన్నారు. కావున 23న విజయదశమి ఆచరించరాదని ప్రముఖ పీఠాలు, ప్రముఖ పంచాంగాలు తెలుపుతున్నాయని తెలిపారు.

## సూర్యాపేట సహకార సంఘం రద్దు

సూర్యాపేట రూరల్, అక్టోబర్ 16 : సూర్యాపేట సహకార సంఘం సభ్యుల ఎన్నికను రద్దు చేస్తూ జిల్లా కోఆపరేటివ్ అధికారి శ్రీధర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా 6నెలలకు ఒకసారి సంఘం చైర్మన్, వైస్ చైర్మన్, సభ్యులు జనరల్ బాడీ సమావేశం నిర్వహించి సంఘం బలోపేతానికి కృషి చేయాల్సి ఉంది. కానీ సంఘం సభ్యులు ఏడాదిగా ఎలాంటి సమావేశాలు నిర్వహించకపోవడంతో మొత్తం 13మంది సభ్యులు, చైర్మన్, వైస్ చైర్మన్‌తో పాటుగా సభ్యుల ఎన్నికను రద్దు చేశారు. దీంతో సహకార సంఘం సభ్యులందరూ తాజా మాజీలుగా మారనున్నారు.

## రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎండ్లపల్లి విద్యార్థి

సూర్యాపేట రూరల్, అక్టోబర్ 16 : మహబూబ్‌నగర్‌లో ఈ నెల 19 నుంచి నిర్వహించే రాష్ట్ర స్థాయి స్కూల్ గేమ్స్ వాలీబాల్ అండర్-17 పోటీలకు సూర్యాపేట మండలంలోని ఎండ్లపల్లి గ్రామ జడ్పీహెచ్‌ఎస్ పదో తరగతి విద్యార్థి సూరారపు విజయ్ ఎంపికైనట్లు పాఠశాల పీఈటీ కుంభం శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజయ్ రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ఉమ్మడి నల్లగొండ జిల్లా వాలీబాల్ టీమ్ నుంచి పోటీల్లో పాల్గొననున్నట్లు తెలిపారు. రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైన విజయ్‌ని పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్వర్లు, సర్పంచ్ దండి సుగుణమ్మ, ఎస్‌ఎంసీ చైర్మన్ సత్యమూర్తి, దండి రమేశ్, రవీందర్ అభినందించారు.

# ఘనంగా బతుకమ్మ సంబురాలు



బతుకమ్మ ఆడుతున్న మహిళలు

బొడ్రాయిబజార్, అక్టోబర్ 16 : జిల్లాకేంద్రంలోని ఆర్య వైశ్య మహిళలు ఆనందోత్సాహాల నడుమ బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఇమ్మడి సోమనర్సయ్య సహకారంతో జిల్లా ఆర్య వైశ్య మహిళా సంఘం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలోని బతుకమ్మ ఘాట్ వద్ద సోమవారం ఏర్పాటు చేసిన వేడుకల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహిళలు అందంగా తయారు చేసిన బతుకమ్మలను తీసుకొచ్చి ఆడిపాడారు. మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి గుంటకండ్ల సునీత వేడుకల్లో పాల్గొని మహిళలతో కలిసి ఆడిపాడారు. అనంతరం సద్దుల చెరువులో బతుకమ్మలను వదిలారు. ఈ సందర్భంగా ఐదు ఉత్తమ బతుకమ్మలను ఎంపిక చేసి బహుమతులు ప్రధానం చేశారు. కార్యక్రమంలో జిల్లా ఆర్యవైశ్య సంఘం మహిళా అధ్యక్షురాలు గుండా శ్రీదేవి, యువజన అధ్యక్షుడు మీలా వంశీ, మహిళా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి మీలా వీరమణి, కోశాధికారి సోమా పద్మ, ఆర్యవైశ్య సంఘం నాయకులు మీలా వాసుదేవ్, గుండా మురళి, కలకోట లక్ష్మయ్య, గుండా శ్రీధర్, గుండా ప్రేమలత, శ్రీరంగం రాము, తల్లాడ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



బతుకమ్మ ఆడుతున్న మంత్రి జగదీశ్‌రెడ్డి సతీమణి సునీత



ప్రమాణస్వీకారం చేస్తున్న సీఆర్‌పీల సంఘం జిల్లా కమిటీ సభ్యులు

## సీఆర్పీల సంఘం జిల్లా అధ్యక్షుడిగా శ్రీనివాస్

బొడ్రాయిబజార్, అక్టోబర్ 16 : విద్యాశాఖ సమగ్ర శిక్షణలో పని చేస్తున్న క్లస్టర్ రిసోర్స్ పర్సన్(సీఆర్పీ) సంఘం జిల్లా నూతన కమిటీ అధ్యక్షుడిగా కాంపాటి శ్రీనివాస్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక నలంద జూనియర్ కళాశాలలో సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శిగా జలగం లింగయ్య, కోశాధికారిగా సత్యనారాయణ, ఉపాధ్యక్షులుగా కాటి శ్రీనివాస్, వహీద్, రాజేశ్, గోవర్ధన్, అశోక్, మహిళా అధ్యక్షురాలిగా శారద, మహిళా కార్యదర్శిగా సావిత్రి, కార్యదర్శులుగా జానకిరాం, రవీందర్, గురుస్వామి, ఎం.లింగయ్య, ప్రచార కార్యదర్శిగా బి.శ్రీధర్ ఎన్నికయ్యారు. నూతన కమిటీతో సీఆర్పీల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దుండిగల్ యాదగిరి, పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు జ్యోతుల చంద్రశేఖర్, సీఆర్పీల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కంచర్ల మహేందర్ ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో మామిడి సైదయ్య, రామిడి వెంకట్‌రెడ్డి, కట్టా రాజు పాల్గొన్నారు.

## పీహెచ్‌సీ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలి

మోటకొండూర్, అక్టోబర్ 16 : పీహెచ్‌సీ సిబ్బంది విధులు సక్రమంగా నిర్వహించాలని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి పరిపూర్ణాచారి అన్నారు. సోమవారం మోటకొండూరు పీహెచ్‌సీని ఆకస్మికంగా సందర్శించి రికార్డులను పరిశీలించారు. ప్రభుత్వ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.